క్లుప్తంగా

గాంధీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని గ్యాస్ ఏజెన్సీ అధినేత కొత్తా అనంతరావు, చంద్రావతి, కోశల ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలను కొనసాగించాలని కోరారు. విద్యార్థులు పెద్దలను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్, ఉపాధ్యాయులు బి.శంకరరావు, సీహెచ్ సత్యనారాయణ, ఎస్.షర్మిళారాణి, డి.శ్రీను, బి.గౌరీప్రసాద్, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు బలి



సంఘటన స్థలంలో మృతి చెందిన ఆవు

వంగర: పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. కోరాడ గంగులుకు చెందిన ఈ ఆవు పంట పొలాల గట్టుపై గడ్డి మేస్తుండగా ఒక్కసారిగా పడిన పిడుగుపాటుకు మృతి చెందినట్లు తహసీల్దార్ డి.ఐజాక్ తెలిపారు.

సీహెచ్‌సీకి డయేరియా రోగుల తాకిడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

బాడంగి: సీహెచ్‌సీకి డయేరియా రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 మంది వరకు స్వల్ప జ్వరం, విరేచనాలు, వాంతుల కారణంగా ఆస్పత్రిలో చేరారు. వీరికి వైద్య సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పాటు ప్రయాణాలు, ఫంక్షన్లలో భోజనాల ప్రభావంతో డయేరియా బారినపడుతున్నారు. తరచూ మంచినీరు, మజ్జిగ, కొబ్బరినీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

రెండో ఎంఈఓగా పాపారావు

తెర్లాం: మండల రెండో ఎంఈఓగా ఆర్.పాపారావు నియమితులైనట్లు ఎంఈఓ జె.త్రినాధరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాపారావుకి పలువురు ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

నిత్యవసర సరుకుల పంపిణీ



నిత్యవసర సరుకులు అందజేస్తున్న యువజన సంఘం సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన శివ రామాంజనేయ యువజన సంఘం సభ్యులు తమ ఔదార్యం చాటుకున్నారు. గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాసరావు, మీసాల రామకృష్ణ, గాడెపల్లి గోవిందరావు, బెజ్జిపురపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం: మండల కేంద్రంలోని జీఎంఆర్ నైరెడ్ శిక్ష ణ సంస్థలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పురుషులకు 30 రోజుల హౌస్ వైరింగ్, 45 రోజుల కంప్యూటర్ హార్డ్‌వేర్ శిక్షణ ఉంటుందని, మహిళలకు 30 రోజుల హోమ్ నర్సింగ్, 30 రోజు ల లేడీస్ టైలరింగ్, 30 రోజుల కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలి శిక్షణ ఉంటుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న యువతీయువకులు అంతా ఈ శిక్షణకు అర్హులన్నారు. పదో తరగతి మార్క్స్ లిస్ట్, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కనే ఉన్న సంస్థ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు టీషర్ట్, టూల్ కిట్లు ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9866913371, 94917411 29, 9014716255ను సంప్రదించాలని కోరారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణరాజపురం గ్రామంలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా, కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ఆయన అభిమతమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. సీఎంగా 14 ఏళ్లు పరిపాలించిన చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికలకు ఏడాది ముందు మళ్లీ అబద్ధపు హామీలతో మేనిఫెస్టో రూపొందించి, విడుదల చేశారని విమర్శించారు. సీఎం జగనన్న ఒక్కడే తన మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చి రికార్డు సృష్టించారన్నారు. ఎంతోమంది ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధితో జీవనోపాధి పొందారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే 2024లోనూ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ రాగోలు పద్మజా రమేష్‌నాయుడు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.కేసరి, ఎంపీటీసీ వి.వెంకటేశ్వరనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాజాం: రాజయ్యపేటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్



రేగిడి: రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ గోవిందరావు

రాజాం: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజయ్యపేట గ్రామ రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే)లో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. గతంలో టీడీపీ రైతులను మోసగించిందని, ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం విత్తనాలు, ఎరువుల సరఫరా దగ్గర నుంచి పంట కొనుగోళ్ల వరకు చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు బాగుండాలనే ఉద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకు రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చారన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియజేయడం జరుగుతోందన్నారు. ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ కరణం గోవిందరావు చేతుల మీదుగా రైతులకు ఆదివారం విత్తనాలు పంపిణీ చేశారు. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రైతులకు ఎన్నో విధాలుగా ప్రోత్సహిస్తోందని సర్పంచ్ అన్నారు. సకాలంలో విత్తనాలు, ఎరువుల సరఫరా దగ్గర నుంచి పంట కొనుగోళ్లు వరకు అన్నీ ఆర్‌బీకేల వద్దనే జరుగుతుండడం అన్నదాతకు వ్యయప్రయాసలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగారువలసలో గడప గడపకు..

వంగర: మండలంలోని కొప్పరవలస పంచాయతీ, బంగారువలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలంతా హాజరు కావాలని వారు కోరారు.

122 మందికి ఆరోగ్య పరీక్షలు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామ సచివాలయం వద్ద విజయనగరం డాక్టర్ శ్రీరామ్మూర్తి ఎముకల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు కిశోర్ శిబిరానికి హాజరైన 122 మందికి ఉచితంగా వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థినితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించడం, కథలు చెప్పించడం, రాయించడం వంటివి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు.

సూక్ష్మసేద్యంతో సాగునీరు ఆదా



మునకలవలస గ్రామ పొలాల్లోని స్ప్రింక్లర్ పైపులు పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: సూక్ష్మసేద్యంతో సాగునీటిని ఆదా చేయవచ్చని, అందుకే నీటివనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో బిందుసేద్యం, తుంపరసేద్యం అమలు చేస్తున్నామని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని మునకలవలస గ్రామంలో పలువురు రైతులకు అందించిన స్ప్రింక్లర్ పైపులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూక్ష్మసేద్యం విధానంలో భాగంగా రైతులకు 55 శాతం, 90 శాతం రాయితీతో ఈ పైపులు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇవి కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, మైక్రో ఇరిగేషన్ అధికారిణి శ్రీలత, బిజినెస్ సీఈఓ సుపేష్, వీఏఏ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



నేలకూలిన విద్యుత్ స్తంభాలు

వంగర: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అకస్మాత్తుగా పెద్దఎత్తున గాలులు వీయడంతో ఎం.సీతారాంపురం–వంగర గ్రామాల మధ్య ఐదు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. ఎం.సీతారాంపురం పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు మాత్రమే సరఫరా నిలిపివేసి, అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన విద్యార్థి దువ్వారపు మణికంఠ కనిపించడం లేదని తండ్రి ఎర్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మణికంఠ తనకు నచ్చిన కళాశాలలో చేర్పించమని పట్టుబట్టగా, తల్లిదండ్రులు నిరాకరించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆకట్టుకున్న యోగాసన పోటీలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రాజాం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వికాస తరంగిణి కార్యాలయంలో ఆదివారం చేపట్టిన యోగాసన పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి తదితర మండలాల నుంచి పలు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు, యువతీయువకులు పాల్గొన్నారు. ఒకటో విభాగంలో ప్రథమ బహుమతిని రాజాం డీఏవీ స్కూల్‌కు చెందిన నర్సిపురం హేమసమీక్ష, ద్వితీయ బహుమతిని అదే స్కూల్‌కు చెందిన జస్విత్, తృతీయ బహుమతిని రాజాంకు చెందిన శేషపు ముఖేష్‌కుమార్ దక్కించుకున్నారు. రెండో విభాగంలో సంతకవిటి మండలంలోని మందరాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలి విశాలాక్షి ప్రథమ బహుమతిని, డొంకరి లీలావతి ద్వితీయ బహుమతిని, పోతురాజు నిహారిక తృతీయ బహుమతిని, రాజాం డీఏవీ స్కూల్ విద్యార్థులు గుడివాడ మధుర, భీమరశెట్టి సాయిసన్నిహిత కన్సోలేషన్ బహుమతులు సాధించారు. మూడో విభాగంలో రాజాం విద్యానికేతన్ స్కూల్‌కు చెందిన వాన జ్ఞానేశ్వర్ ప్రథమ బహుమతిని, డీఏవీ స్కూల్ విద్యార్థిని శాసపు యశస్విని ద్వితీయ బహుమతి, విద్యానికేతన్ స్కూల్ విద్యార్థి నాగచైతన్య తృతీయ బహుమతిని దక్కించుకున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపు వయసు విభాగంలో ప్రథమ బహుమతిని గుడివాడ లలితకుమారి, ద్వితీయ బహుమతిని కేవీబీ సతీష్, తృతీయ బహుమతిని వెన్నపు వీరబాబు పొందారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, కొరికాన శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు, గెడ్డాపు శ్రీలక్ష్మి, వాకచర్ల పైడిరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సమన్వయకర్త ఎ.నీలకంఠం, ఎస్.జగదీష్, టి.సూర్యప్రకాష్, ఎం.మన్మథరావు, సీహెచ్ జయరాం, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అదనపు భవనాల నిర్మాణం



కంచరాం పాఠశాలలో జరుగుతున్న అదనపు భవనాల నిర్మాణం

రాజాం: మండలంలోని కంచరాం జెడ్పీ హైస్కూల్ వద్ద రూ.60 లక్షల నిధులతో అదనపు భవనాల నిర్మాణం చేపడుతున్నారు. మనబడి నాడు–నేడు తొలి విడతలో రూ.50 లక్షలు వెచ్చించి, పాత భవనాలను ఆధునీకరించడంతో పాటు ఫ్లోరింగ్, బాత్‌రూమ్‌ల నిర్మాణం, తాగునీరు సదుపాయాలు కల్పించినట్లు ఏఈ రాధకృష్ణ తెలిపారు. ప్రస్తుతం రెండో ఫ్లోర్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోందన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం విడుదలైన ఈ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మంచి మంచి ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారు.

–సాక్షి నెట్‌వర్క్



పోరాం జగన్నాథం నాయుడు
ఆలిండియా
ర్యాంకు: 1011
రేగిడి మండలం,
పోరాం గ్రామం.



పాడి పార్థివ్‌నాయుడు
ఆలిండియా
ర్యాంకు: 3,610
రేగిడి మండలం,
కొమెర గ్రామం.



మజ్జి షర్మిల
ఆలిండియా
ర్యాంకు: 2,847
రాజాం మండలం,
వంజారాంపేట గ్రామం.



వంజరాపు రమ్యశ్రీ
ఆలిండియా
ర్యాంకు: 2,291
రాజాం, వినాయకనగర్.



కె.వంశీకృష్ణ
ఆలిండియా
ర్యాంకు: 1,446
బొబ్బిలి, రాజమహల్ కాలనీ.



బొత్స తన్మయి
ఆలిండియా
ర్యాంకు: 3,794
బాడంగి మండలం,
పాల్తేరు గ్రామం.

ఇంటింటి కుళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్యే



కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని నారాయణరాజపురం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.8.6 లక్షల వ్యయంతో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీటి సరఫరాను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, ఇప్పటికే క్రాస్ ప్రోగ్రాం కింద మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లును కూడా బాగు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ ఆర్.పద్మజారమేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.కేసరి, ఎంపీటీసీ సభ్యుడు వి.వెంకటేశ్వరనాయుడు, తాలాడ ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు డి.తిరుపతి, ఎమ్.మోహన్, ఆర్.స్వామినాయుడు, వి.రమణ, ఆర్.రమణ బి.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణతో స్వయం ఉపాధి



శిక్షణార్థులకు సూచనలిస్తున్న వైకేపీ ఏసీ చిరంజీవి

రాజాం: కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) ఏసీ చిరంజీవి తెలిపారు. ఉపాధి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను ఆయన ఆదివారం పరిశీలించారు. మరో 30 రోజుల్లో శిక్షణ ముగుస్తుందని, శిక్షణలో నేర్పిన అంశాలను జాగ్రత్తగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం పీఎంఈజీపై ద్వారా రుణాలు, సర్టిఫికెట్లు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ పి.కుమారి, అసిస్టెంట్ ట్రైనీ ఎల్.అనూరాధ, ఏపీఎంలు దధికుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో ట్రాఫిక్ అవస్థలు



రామభద్రపురం గ్రామం మధ్యలో నెలకొన్న ట్రాఫిక్

రామభద్రపురం: అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో రామభద్రపురంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి అటు బొబ్బిలి జంక్షన్, ఇటు గ్రామం మీదుగా సాలూరు వెళ్లే రహదారి చివరి వరకు వ్యాపారులు, ఇంటి యజమానులు రోడ్డును ఆక్రమించుకోవడంతో 40 అడుగుల రోడ్డు 20 అడుగులకు కుదించుకుపోయింది. రోడ్డును ఆనించి ఉన్న దుకాణాలతో పాటు వాటి ముందు వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల రోడ్డుమీదుగా ప్రయాణించడం కష్టతరమవుతోంది. ఏదైనా భారీ వాహనం ఒక్కటి వస్తే చాలు ఇరువైపుల నుంచి వచ్చే వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి. అధికారులు, పాలకులు మారినా తమ గ్రామ పరిస్థితి మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీధర్ రోడ్డు పక్క ఉన్న దుకాణాదారులతో సమావేశమై ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా రోజూ అదేతీరు కనబడుతుండడం గమనార్హం.

చురుగ్గా మట్టి నమూనాల సేకరణ

బాడంగి: మండలంలోని పెద్దింటి స్వామినాయుడు పొలంలో మట్టి నమూనాలను ఆదివారం సేకరించారు. మొత్తం 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలను సేకరిస్తున్నామని ఏఓ శిరీష తెలిపారు. భూసార పరీక్షల నిమిత్తం సేకరిస్తున్న ఈ మట్టి నమూనాల ద్వారా ఏ నేల ఏ రకమైనది.. ఏ రకమైన నేలలో ఏ రకమైన పంట వేస్తే అధిక దిగుబడులు వస్తాయన్న విషయం తెలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.